


చేయూత కరువు!

కష్టాల్లో చేనేత కార్మికులు

- ఏళ్ల తరబడి పెండింగ్‌లో చేనేత సంఘాల బకాయిలు
- సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసినా అవ్వని త్రిఫ్ట్ ఫండ్ బిల్లులు
- నిలిచిన యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, మార్కెట్ ఇన్సెంటివ్, రిబేటు
- మరో వైపు చేనేత వస్త్రాలపై జీఎస్టీ భారం
- అప్పుల ఊబిలోకి సంఘాలు.. ఐదేళ్లుగా ఎన్నికలు నిల్



మగ్గం నేస్తున్న కార్మికుడు

రుణమాఫీ ఊసేలేదు

2018 ఆగస్టులో చేనేత సహకార సంఘాలు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారు. ఈ రుణ మాఫీ అంశం గాడిలో పడే సమయానికి పాలకులంతా ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయారు. దీంతో రుణ మాఫీ అంశం అటకెక్కింది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు రుణమాఫీ అంశం తెరపైకి రాకుండా జాగ్రత్త పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలోని చేనేత సంఘాలకు ఇవ్వాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వానికి బిల్లులు పంపారు. సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ చేసినా, అవి మంజూరు కాలేదు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఈ బిల్లులు మంజూరవుతాయనే ఆశతో చేనేత సంఘాల ప్రతినిధులు, కార్మికులు జిల్లా చేనేత, జౌళిశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇంతలో ఈ బిల్లులు మంజూరు కాకుండా వెనక్కు వచ్చేశాయని అధికారులు చెప్పడంతో కార్మికులు ఖంగుతిన్నారు.

చేనేత రంగం రోజురోజుకు కుదేలైపోతోంది. ఏళ్ల తరబడి చేనేత కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకుండా నిలిపివేయడంతో చేనేత కార్మికుల జీవనం కష్టతరంగా మారింది. చేసేందుకు పనిలేక, భవిష్యత్తులో పనిదొరుకుతుందో లేదో తెలియక, వెంటాడుతున్న అనారోగ్య సమస్యలతో సతమతమైపోతున్నారు. 2018 నుంచి త్రిఫ్ట్ ఫండ్, ఇతరత్రా బకాయిలను విడుదల చేయకుండా నిలిపివేయడంతో కార్మికులకు అందాల్సిన రాయితీలు అందడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మగ్గం ఉన్న కార్మికులకే వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేశారు. ఇందులోనూ అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. చేనేత వస్త్రాల తయారీలో అనుబంధ పనులు చేసే కార్మికులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందలేకపోయారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 33 చేనేత సహకార సంఘాలున్నాయి. 2018 నుంచి చేనేత సంఘాలకు ఇవ్వాల్సిన బకాయిలు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు ఈ బిల్లులను ఇవ్వకుండా తొక్కిపెట్టేశారు. చేనేత సంఘాలకు యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, మార్కెట్ ఇన్సెంటివ్ తదితరాలను విడుదల చేయకుండా జాప్యం చేశారు. చేనేత కార్మికుల ఒక్కో కుటుంబానికి ఏడాదికి గత వైసీపీ ప్రభుత్వం రూ.24 వేలు చొప్పున ఇచ్చింది. కానీ రోజువారీ పని కల్పించకపోవడంతో, చేనేత కార్మికులు చేసేందుకు పనిలేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెడన పోలవరం, ఘంటసాల పరిసర ప్రాంతాల్లోనే 23 చేనేత సంఘాలున్నాయి. గత ఐదారు సంవత్సరాలుగా ఈ సంఘాల ద్వారా చేనేత కార్మికులకు నామమాత్రపు పనికూడా ఇవ్వలేని దుస్థితి నెలకొంది. జిల్లాలోని చేనేత సంఘాలకు రూ.10 కోట్లకు పైగాబిల్లులు, త్రిఫ్ట్‌ఫండ్ రూపంలో రూ.2.50 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. చేనేత వస్త్రాలకు రిబేటు ఇవ్వకుండా నిలిపివేయడంతో చేనేత సహకార సంఘాలు ఆర్థికపరమైన చిక్కుల్లోకి నెట్టి వేయబడ్డాయి. సంఘాల ఖాతాల్లో ఉన్న మూలధనంలో నుంచి నగదును తీసి సిబ్బంది జీతభత్యాలు, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది.

ఆశించిన స్థాయిలో పెరగని మజూరీ ధరలు

గత ఐదు సంవత్సరాలుగా చేనేత వస్త్రాల మజూరీ ధరలు పెరగలేదని చేనేత కార్మికులు చెబుతున్నారు. 42 నుంచి 50 గజాల నిడివిగల చీరను నేస్తే వస్త్రం నాణ్యతను బట్టి మజూరీగా గతంలో రూ.4,500, రూ.5 వేలు, రూ.6 వేల వరకు ఇచ్చేవారు. నాలుగు నెలల క్రితం ఈ మజూరీ ధరను మరో రూ.500 పెంచారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో పోలిస్తే చేనేత కార్మికులు వస్త్రాల తయారీకి ఖర్చులతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. యారన్‌పై ఐదు శాతం, రంగులు, రసాయనాల కొనుగోలుపై 18శాతం, జీఎస్టీ రూపంలో ఐదు శాతం చెల్లించాల్సి వస్తోంది. చేనేత వస్త్రాలపై జీఎస్టీని మినహాయించాలని కార్మికులు, చేనేత సంఘాల నాయకులు ఎంతోకాలంగా కోరుతున్నారు. జీఎస్టీని ముందుగా చెల్లించండి, ఆ తర్వాత వెనక్కి ఇస్తామని పాలకులు చెబుతున్నా.. ఎప్పటికి అమలు జరుగుతుందో తెలియని పరిస్థితి.

ఎన్నికలకు నోచుకోని సొసైటీలు

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. నామినేటెడ్ పద్ధతిలో సొసైటీలకు ప్రతి ఆరు నెలలకోసారి వన్‌మెన్ కమిటీ పేరుతో అధ్యక్షులను నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కమిటీలను రద్దు చేసింది. చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో పనిచేసే డెవలప్‌మెంట్ అధికారులకు చేనేత సంఘాల పరిపాలనా బాధ్యతలను అప్పగించారు. ఒక్కో అధికారి ఏడు నుంచి ఎనిమిది సంఘాలను పర్యవేక్షించాల్సి మిగతా 6లో..

ఆయన రూటే సప 'రేటు'!

విద్యుత్‌శాఖలో అంతులేని అవినీతి!

- నందివాడ మండలంలో అనధికార చేపలు, రొయ్యల చెరువుల నుంచి అక్రమ వసూళ్లు!
- 'బుడమేరు ఆధునికీకరణ' వ్యవహారంలో తాజాగా చెరువుకు రూ.2 వేల కప్పం వసూలు
- అదనపులోడు పేరుతో రూ.లక్షల్లో డిమాండ్
- నేరుగానే బేరసారాలు.. బెంబేలెత్తిపోతున్న సొంతశాఖ సిబ్బంది, వినియోగదారులు



విద్యుత్‌శాఖలో ఓ ఉన్నత అధికారి రూటే స'రేటు'. ఆయన ధన దాహానికి అంతే లేకుండా పోయింది. అనధికార చేపల చెరువుల నుంచి మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా అక్రమ వసూళ్ల దందా కొనసాగిస్తూనే.. తాజాగా బుడమేరులో చేస్తున్న ఆధునికీకరణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా ఎక్కువ సమయం నిలిపివేయకుండా ఉండేందుకు ఒక్కో చెరువు నుంచి రూ.2 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అపార్టుమెంట్లు, పరిశ్రమలు తదితరాలపై అదనపులోడు జరిమానాలు వేయకుండా లక్షల రూపాయల బేరసారాలు నడుపుతున్నట్లు తెలిసింది. ఈయన దెబ్బకు ఇటు ఉద్యోగులు, అటు వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.

ఆంధ్రజ్యోతి-గుడివాడ: నందివాడ మండలం కుదరవల్లి- ఇలపర్రు గ్రామాల మధ్యలో బుడమేరు లోపల అక్రమ చెరువులకు విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఆధునికీకరణలో భాగంగా పేరుకుపోయిన చెత్త, గుర్రపు డెక్కలను తొలగించాల్సి ఉండటంతో యంత్రాలతో పనులు చేపట్టారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో 11 కేవీ విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయి. తప్పనిసరిగా విద్యుత్ సరఫరా నిలిపి పనులు చేట్టాల్సి ఉంది. చెరువుల యజమానులతో బేరసారాలు మాట్లాడుకుని రోజుకు రెండు గంటలు మాత్రమే సరఫరా నిలిపేటట్టు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. దీని కోసం ప్రతి కనెక్షన్‌కు రూ.2 వేలు చొప్పున కప్పంగా కట్టాలని, లేనిపక్షంలో అక్రమ కనెక్షన్లుగా చూపి పీకేస్తానని హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిసింది. ఏ రోజుకు ఆ రోజు చెల్లింపులు చేయాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం. బుడమేరు లోపల 60కి పైగా ఇటువంటి అక్రమ విద్యుత్ మిగతా 6లో..

కల్లాల్లో ధాన్యం.. రైతుల్లో దైన్యం!

6లో

వరద దుర్భేద్యం

- అమరావతిలో వేగంగా ముంపు నివారణ పనులు

8లో

వైభవోపేతంగా..

- నంది వాహనంపై గంగాపార్వతీ సమేత మల్లేశ్వరుల ఊరేగింపు

8లో

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

మచిలీపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు శనివారం నుంచి పనిచేస్తాయని జేసీ గీతాంజలిశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతులు తమ వద్ద ఉన్న ధాన్యం విక్రయించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రూ.కోట్లు వృథా!?

- సబ్ స్టేషన్ల నిర్మాణంలో ట్రాన్స్‌కో తీవ్ర నిర్లక్ష్యం
- గన్నవరంలో రూ.15 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణం
- వినియోగంలోకి తేకపోవడంతో అడవిలా ఆవరణం
- మేధా టవర్ దగ్గర రూ.132 కోట్లతో పనులు ప్రారంభం
- ఆగిపోయిన పనులు.. గోప్యంగా వివరాలు
- ప్రణాళిక లేని పనులతో ప్రభుత్వ ఖజానాకు తూట్లు!
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



గన్నవరంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో గన్నవరంలో రూ.15 కోట్ల నిర్మించిన సబ్‌స్టేషన్‌ను నేటి వరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రస్తుతం అక్కడ పిచ్చిమొక్కలు, కంప పెరిగి అడవిని తలపిస్తోంది. కేసరపల్లి మేధా టవర్ వద్ద రూ.132 కోట్లతో సబ్ స్టేషన్ పనులు చేపట్టి మధ్యలో వదిలేశారు. ఇప్పటి వరకు అతీగతీలేదు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అనేక చోట్ల అసంపూర్తిగానే సబ్ స్టేషన్లు దర్శనమిస్తున్నాయి. ప్రణాళిక లేని పనులతోనే ఈ దుస్థితి ఏర్పడిందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఒక ప్రణాళిక లేకుండా పనులు చేయటం ట్రాన్స్‌కో అధికారులకు పరిపాటిగా మారింది. వారు చేస్తున్న పనుల వల్ల కోట్ల రూపాయలు వృథా అవుతున్నాయి తప్ప ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో చేపట్టిన సబ్‌స్టేషన్లలో కొన్ని ఎందుకు చేపడుతున్నారో కూడా అర్థం కాకుండా ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో గన్నవరంలో రూ.15 కోట్ల వ్యయంతో 2016-17లో 132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఒక ఎకరంపైగా విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీని గురించి పట్టించుకోలేదు. దీంతో సబ్‌స్టేషన్ మొత్తం పిచ్చి మొక్కలు, పొదలతో నిండిపోయింది. టవర్ల అంత ఎత్తు తీగ మొక్కలు పాకి కమ్ముకుపోయాయి. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికే రూ.10 కోట్లు ఖర్చు చేసినట్టుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మరో రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు లైన్లు, ఇతర ఎక్విప్‌మెంట్‌కు ఖర్చు చేశారని తెలుస్తోంది. ఇప్పటికీ పాత సబ్‌స్టేషన్‌నే వినియోగిస్తున్నారు తప్ప కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌ను మాత్రం వినియోగంలోకి తీసుకురావటం లేదు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇలా మూలన పడేయటంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.కోటి వరకు ఖర్చు చేసి వదిలేశారు..

కేసరపల్లి మేధా టవర్ దగ్గర రూ.132 కోట్లతో మరో 220 /132 మిగతా 6లో..

- టెక్నాలజీతో మభ్య పెడుతున్న బెట్టింగ్‌బాబులు
- చేతిలో డబ్బు కనిపించకుండా పందేలు
- కీలకమైన యాప్‌ల సృష్టి.. వాటిద్వారా లావాదేవీలు
- మూలాలు వెతికే పనిలో పోలీసులు

'యాప్'రే..!

బెట్టింగ్ కేసుల్లో పోలీసులకు సవాల్‌గా యాప్‌లు

రూ.లక్షల్లో బెట్టింగ్‌లు కడతారు.. అంతకు రెట్టింపు సంఖ్యలో గెలుస్తారు.. కొందరేమో ఓడిపోతారు.. అయినా ఎవరి జేబులోనూ రూపాయి కనిపించదు. క్రికెట్ బెట్టింగ్ కేసుల్లో పోలీసులకు ఈ అంశం సవాల్‌గా మారింది. సాంకేతికతను చక్కగా ఉపయోగించుకుంటున్న బెట్టింగ్‌బాబులు ఎక్కడికక్కడ నగదు రూపంలో కనిపించకుండా, యాప్‌ల రూపంలో లావాదేవీలు నిర్వహిస్తుండటంతో ఆ మూలాలు పసిగట్టే పనిలో పోలీసులు తలమునకలయ్యారు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పోలీసుల వేట ఎక్కువయ్యే సరికి క్రికెట్ బెట్టింగ్ గ్యాంగ్‌లు రూటు మార్చాయి. పోలీసులకు చిక్కినా చిల్లిగవ్వ దొరక్కుండా టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నాయి. ఇదే ఇప్పుడు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటి వరకు చట్టాలు, సెక్షన్ల కోసం పుస్తకాలను తిరగేసిన పోలీసులు ఈ బెట్టింగ్ కేసులతో సైబర్ ఫోరెన్సిక్ పుస్తకాలను పట్టుకుంటున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుట్టురట్టు చేసిన బుకీలు, ప్లంటర్లను సంబంధిత పోలీస్‌స్టేషన్లలో అప్పగిస్తున్నారు.

సాంకేతిక మూలాలు ఎక్కడ?

టాస్క్‌ఫోర్స్ పోలీసులు తాజాగా ఎనిమిది మంది బెట్టింగ్‌బాబులను అరెస్టు చేసి పటమట పోలీసులకు అప్పగించారు. వీరంతా రాధే ఎక్సేంజ్ యాప్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు తేలింది. ఇటీవల అవనిగడ్డకు చెందిన ఐదుగురిని అరెస్టు చేయగా, వారంతా పార్కర్ ఎక్సేంజ్ యాప్‌లో పందేలు కడుతున్నట్టు గుర్తించారు. ఇలా బెట్టింగ్‌లు నిర్వహించే ప్రధాన బుకీలు ప్రత్యేకంగా యాప్‌ను తయారు చేయించుకుంటున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇలా ఒక్కో బుకీ సొంత యాప్‌ల ద్వారా క్రికెట్‌పై లక్షలాది రూపాయలను వెనుకేసుకుంటున్నారు. ఇప్పటి వరకు పోలీసులకు బుకీల్లో మూడు, నాలుగు దశల్లో ఉన్నవారే దొరుకుతున్నారు. వారికి డబ్బు వసూలు చేసి ఇచ్చే ఏజెంట్లు చిక్కుతున్నారు. ప్రధాన బుకీలు మాత్రం చిక్కడం లేదు. ఏ యాప్ ద్వారా పందేలు జరుగుతున్నాయో తేలినా వాటికి సంబంధించిన సాంకేతిక మూలాలు దొరకడం పోలీసులకు కష్టసాధ్యంగా మారుతోంది.

కమీషన్ రూపంలో వసూలు

ప్రధాన బుకీలు ఎక్కడ ఉంటారో తెలియదు. వారి కింద మాత్రం దశలవారీగా సబ్‌బుకీలు ఉంటారు. ఈ సబ్‌బుకీల దిగువన ప్లంటర్లు పనిచేస్తున్నారు. బెట్టింగ్‌లో పాల్గొన్నవారు ఎంత ఇవ్వాలి, గెలిచిన వారికి ఎంత చెల్లించాలి.. అనే లెక్కలు మొత్తం యాప్‌ల్లో ఉంటున్నాయి. ఓడిన వారి నుంచి డబ్బు వసూలు చేసే బాధ్యతలను ప్లంటర్లు తీసుకుంటున్నారు. ఆటగాళ్ల దగ్గర నుంచి డబ్బు వసూలు చేసి సబ్‌బుకీలకు ఇచ్చిన వారికి లక్షకు రూ.1,000 కమీషన్ చెల్లిస్తున్నారు. ఆటగాళ్లందరి నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బు వసూలు చేసి అప్పగించిన **వారికి లక్షకు రూ.3 వేలు చెల్లిస్తున్నారు. ఈ డబ్బును వెంటవెంటనే ఖాతాల్లో జమ చేసుకుని ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.**

విదేశాల్లో కాకినాడ బుకీ?

గన్నవరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన ఎనిమిది మంది సబ్‌బుకీలకు యాప్‌లో ప్రవేశాలకు అనుమతి ఇచ్చిన కాకినాడకు చెందిన ప్రధాన బుకీ పండును పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. విదేశాల్లో ఉంటూ బెట్టింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నాడని సమాచారం. ఈ పండునే.. రాధే ఎక్సేంజ్ యాప్ ద్వారా బెట్టింగ్ నడుపుతున్నాడు. ఈ యాప్‌కు అనుసంధానమైన కొంతమందిని కొద్దిరోజుల క్రితం వరంగల్ పోలీసులు పట్టుకున్నట్టు తెలిసింది. ఆ దెబ్బకు పండు విదేశాలకు చెక్కేశాడని దర్యాప్తు బృందాలు అనుమానిస్తున్నాయి.

పకడ్బందీగా యూపీఎస్సీ పరీక్షలు

» ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష

వన్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 13న నిర్వహించనున్న నేషనల్ డిఫెన్స్ అకాడమి (ఎన్డీఏ), నావెల్ అకాడమి (ఎన్ఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్షలను సూక్ష్మ పర్యవేక్షణలో నిర్వహించాలని, ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) ద్వారా నిర్వహించే పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో లైజన్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్‌వైజర్‌లు, లైజన్ కమ్ ఇన్‌స్పెక్టింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 13న ఎన్డీఏ, ఎన్ఏ, సీడీఎస్ పరీక్షలను యూపీఎస్సీ నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,791 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, వీరిలో సీడీఎస్‌కు 577 మంది, ఎన్డీఏ, ఎన్ఏ పరీక్షలకు 1,214 మంది హాజరు



పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కానున్నట్టు చెప్పారు. ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్డీఏ, ఎన్ఏ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందన్నారు. సీడీఎస్ పరీక్షలు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. పరీక్షల నిర్వహణకు 170 మంది ఇన్విజిలేటర్లు, ఆరుగురు వెన్యూ సూపర్‌వైజర్లు, ఆరుగురు లైజన్ అధికారులను నియమించినట్టు చెప్పారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు 30 నిమిషాలకు ముందుగానే చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. స్టేట్ అబ్జర్వర్ కె.ప్రశాంత్‌కుమార్, యూపీఎస్సీ అబ్జర్వర్ ఎన్.రాజేశ్వరరావు, బీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


చంద్రబాబుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న చలసాని ఆంజనేయులు

ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి రండి

» ముఖ్యమంత్రికి చలసాని ఆహ్వానం

గన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండలం వీరవల్లిలోని కృష్ణామిల్క్ యూనియన్-ప్రాజెక్టు కామధేను ప్రాంగణంలో నిర్మించిన సీతారామ లక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని కోరుతూ సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వాన పత్రికను శుక్రవారం అందజేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి ప్రజా వేదిక కార్యక్రమానికి విచ్చేసిన సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి దాసాంజనేయస్వామి ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. సీఎం సానుకూలంగా స్పందించినట్టు ఆంజనేయులు తెలిపారు.


ఈవోకు బంగారు హారాన్ని అందజేస్తున్న దాత దేవినేని సురేంద్ర, కుటుంబసభ్యులు

దుర్గమ్మకు బంగారు హారం కానుక

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మకు హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన దేవినేని సురేంద్ర 110 గ్రాముల బంగారుహారాన్ని కానుకగా ఈవో కె.రామచంద్రమోహన్‌కు శుక్రవారం అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు దాతలకు వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

నేడు గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి : ప్రతి పౌర్ణమినాడు జరిగే గిరిప్రదక్షిణ మాసవారీ ఉత్సవం శనివారం నిర్వహిస్తున్నట్టు దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని టోల్ గేట్ వద్ద కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఘాట్‌రోడ్ అమ్మవారిగుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్త పేట, బ్రాహ్మణవీధి నుంచి తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుతుందని ఈవో పేర్కొన్నారు.

పొన్నవరం సందర్శించిన విశ్రాంత సీజే ఎన్వీ రమణ



వీరులపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ శుక్రవారం తన స్వగ్రామమైన పొన్నవరాన్ని సందర్శించారు. తొలుత ఆయన తెలంగాణ రాష్ట్రంలోని జమలాపురంలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామానికి విచ్చేశారు. కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు, బంధువులతో ముచ్చటించారు. స్వగ్రామానికి రావడం సంతోషంగా ఉందన్నారు.

జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలో నేత్ర వైద్య శిబిరాలు

» రేపు ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్

» ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ నేత టీడీ జనార్దన్ వెల్లడి


మాట్లాడుతున్న టీడీ జనార్దన్

జగ్గయ్యపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జయప్రద ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో ఉచితంగా నేత్ర వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత తొండెపు దశరథ జనార్దన్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎల్ఎస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2018లో 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' నినాదం స్ఫూర్తితో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇటీవల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాల్లో అధికశాతం కంటి సమస్యలు ఉన్నట్టు తేలిందని, చిన్న పిల్లల్లో దృష్టి లోపాలు కనబడుతున్నాయని దీంతో శంకర్ నేత్రాలయంతో కలిసి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈనెల 13న జగ్గయ్యపేటలో వైద్య శిబిరాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారని చెప్పారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, శంకర్ నేత్ర చికిత్సాలయ గ్రూఫ్ ఆఫ్ హస్పిటల్స్ ఎండీ డాక్టర్ నాదెళ్ల స్వాతి, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి విజయ్ చెన్నుపాటి, చైర్మన్ రంగాపురం రాఘవేంద్రలు హాజరవుతారన్నారు. అన్నిగ్రామాల్లో శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఉచిత పరీక్షలు, అవసరమైనవారికి మందులు, కళ్లజోళ్లు, శస్త్రచికిత్సలు ట్రస్టు ద్వారా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నేడు పనిచేయనున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నేడు అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. రెండో శనివారం సెలవు దినం అయినప్పటికీ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆదేశాల మేరకు నేడు అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. రాష్ట్ర స్థాయి కార్యాలయాలతో పాటు జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ పనిచేస్తాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాల సేవలు అందుబాటులో ఉండనున్నాయి. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సెలవు కావటంతో.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండటం కోసం రెండో శనివారం పనిదినంగా ఉన్నతాధికారులు నిర్ణయించారు. అత్యవసరంగా రిజిస్ట్రేషన్లు చేయించుకునేవారు శనివారం రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

ఆయన రూటే సెప'రేటు'!

(5వ పేజీ తరువాయి)

కనెక్షన్‌లు ఉన్నట్లు సమాచారం.

అదనపు లోడు పేరుతో అడ్డదారులు

ప్రతి మూడు లేదా ఆరు నెలలకు విద్యుత్ శాఖ అదనపు వినియోగంపై తనిఖీలు చేపడుతుంది. ఈ క్రమంలో సెక్షన్ పరిధిలోని భారీ పరిశ్రమలు, అపార్టుమెంట్‌ల్లో అదనంగా లోడ్‌ను వినియోగించుకుంటున్నట్లు గుర్తించారు. అదనపు లోడ్ వేయాలని గుర్తించి వారితో బేరసారాలకు దిగుతున్నట్లు సమాచారం. తాను సూచించిన విధంగా చెల్లిస్తే తానే అన్నీ చూసుకుంటానని, లేని పక్షంలో లక్షలాది రూపాయల అపరాధ రుసుం చెల్లించాల్సి ఉందని బెదిరించినట్లు సమాచారం.

పేదలపైనా ప్రతాపం!

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సెంటు భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేద, మధ్య తరగతి వారికి సైతం వసూళ్ల బెడద తప్పడం లేదు. ఎవరి స్థాయికి తగ్గట్టు వారు వసూళ్లకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారు. ఉన్నతాధికారి నుంచి కిందస్థాయి అధికారి వరకు ఎవరి వాటాలు వారికి అందుతున్నట్లు సమాచారం.

కళ్యాణం.. వైభోగం



రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.


కళాకారుల నృత్యం


పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు




ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం


ఎదుర్కోలు దృశ్యం


సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

వెనుకబడిన వర్గాల ఆర్థిక వృద్ధి లక్ష్యం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

వన్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన వర్గాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కల్పిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక పురోగతిని సాధించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు ఆటోలు, ఆర్థిక సహాయం చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీ, కాపు కార్పొరేషన్లు, ఆర్థికంగా వెనకబడిన తరగతుల లబ్ధిదారులకు సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 400 మంది లబ్ధిదారులకు రూ.8 కోట్ల 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించటం జరిగిందన్నారు. ఇందులో బీసీ కార్పొరేషన్ ద్వారా 200 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 2 లక్షల బ్యాంక్ రుణాలను అందజేయటం జరిగిందన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా చంద్రన్న స్వయం ఉపాధి పథకం కింద 150 మంది లబ్ధిదారులకు కోటి 50 లక్షల బ్యాంకు రుణాలను అందజేశామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకం లబ్దిదారులు 50 మందికి 50 లక్షల రూపాయల బ్యాంకు రుణాలను అందించటం జరిగిందన్నారు. వెనుకబడిన వర్గాల వారు స్వయం ఉపాధి పథకాలకు ముందుకు వస్తే అర్హులైన ప్రతిఒక్కరికీ సబ్సిడీని మంజూరు చేసి బ్యాంకుల



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులు ఆటోలు, చిరు వ్యాపారాలు, జనరిక్ మెడికల్ షాపులు నిర్వహించుకునేందుకు వెనుకబడిన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రుణాలను మంజూరు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రజల్లో దాన స్ఫూర్తిని వినియోగించుకుని ప్రభుత్వం, ప్రైవేటు, పబ్లిక్ పీపుల్స్ భాగస్వామ్యంతో పీ4 విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో పేదరికాన్ని నిర్మూలించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ పరిపాలనా అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి కె.లక్ష్మీదేవమ్మ, సహాయ సంక్షేమ అధికారి పి.శ్రీనివాసరావు, బీసీ కార్పొరేషన్ ఏఈవో కె.రాజేంద్ర బాబు, రాష్ట్ర వెల్ఫేర్ ఆఫీసర్లు రజనీ కుమారి, హేమ ప్రియ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే సిద్ధాంతాలు ఆదర్శప్రాయం : లక్ష్మీశ

బెంజిసర్కిల్ : సమసమాజ స్థాపనకు అహర్నిశలు కృషిచేసిన సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు


జ్యోతిరావు పూలే చిత్రపటానికి కలెక్టర్ నివాళి

పూలే అని, ఆయనను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని పింగళివెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు.

రూ.కోట్లు వృథా!?

(5వ పేజీ తరువాయి)

కేవీ సబ్‌స్టేషన్ అని హడావుడి చేశారు. పనులు కూడా మొదలు పెట్టారు. రూ.కోటి వరకు ఖర్చు చేసినట్టు ప్రాథమిక సమాచారం. ఎంత ఖర్చు చేశారన్న వివరాలు మాత్రం ట్రాన్స్‌కో అధికారులు అత్యంత రహస్యంగా ఉంచుతున్నారు. మేథ టవర్ దగ్గర సబ్‌స్టేషన్ పనులు మొదలు పెట్టి దానిని కూడా మధ్యలో వదిలేశారు. కాగా, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ పనులు చేపడుతున్నారు. మరి గన్నవరంలో కట్టిన సబ్‌స్టేషన్, కేసరపల్లి మేథ టవర్ దగ్గర నిర్మించి వదిలేసిన సబ్‌స్టేషన్ పనులు ఎందుకు చేపట్టారన్నది ఇప్పటికీ మిస్టరీనే. ఎయిర్‌పోర్టు వద్ద చేపడుతున్న సబ్‌స్టేషన్ అయినా పూర్తి స్థాయిలో చేపడతారా? మధ్యలో వదిలేస్తారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

రూ.కోట్ల విలువైన భూమి ఇలా..

గన్నవరంలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ స్థలం ఎకరానికి పైగా ఉంది. గన్నవరం పట్టణంలో ఎకరం భూమి ధర కోట్ల రూపాయల్లోనే ఉంటుంది. ఈ స్థలాన్ని కూడా దేనికీ పనికి రాకుండా చేశారు. సబ్‌స్టేషన్‌ను మూలనపెట్టడంతో దీని స్థలం కూడా నిరుపయోగంగా ఉంటోంది.

మొగల్రాజపురం సబ్ స్టేషన్‌లోనూ..

విజయవాడ నగరంలో ప్రధానంగా మొగల్రాజపురంలో 132/33 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ (జీఐఎస్) సబ్‌స్టేషన్‌ను రూ.100 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారు. ఇది వినియోగంలోకి వచ్చినప్పటి నుంచి రెగ్యులర్‌గా ట్రిప్ అవుతోంది. ఇండోర్ కేబుల్స్ సరిగా చేయకపోవటం వల్ల అంతరాయం ఏర్పడుతోందని తెలుస్తోంది. సీపీడీసీఎల్ డిస్ట్రిబ్యూషన్ వాళ్లు దీనిని వినియోగించటానికి ఇష్టపడటం లేదు.

ఉయ్యూరు, బంటుమిల్లిలో అసంపూర్తి పనులు

ఉయ్యూరులో 132/33 కేవీ సబ్‌స్టేషన్ కూడా అసంపూర్తిగానే వదిలేశారు. అప్పట్లో టెండర్లు కూడా పిలిచారు. పనులు కూడా ప్రారంభించారు. పనులు ఎందుకు ఆగిపోయాయో తెలియదు. బంటుమిల్లిలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కూడా మధ్యలో ఆపేశారు. దాదాపుగా ఐదారేళ్లుగా నిరుపయోగంగా ఉంటోంది.

పనుల్లేక పస్తులు!

(5వ పేజీ తరువాయి)

వస్తోంది. పరిపాలన కొంతమేర సవ్యంగా సాగేందుకు గతంలో చేనేత సంఘాలకు అధ్యక్షులుగా పనిచేసిన సీనియర్‌లకు టేక్ ఓవర్ చార్జీ ఇచ్చారు. అయితే చేనేత సంఘాలకు ఆర్థికపరంగా చేయూత లేకపోవడం, ఎక్కడి బిల్లులు అక్కడే పెండింగ్‌లో ఉండటంతో వారు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు అఖిల పక్ష కమిటీని వేసి, ఈ కమిటీ ద్వారా కీలక నిర్ణయాలు తీసుకుని, ఈ రంగాన్ని బతికించాలని చేనేత రంగంలోని పెద్దలు కోరుతున్నారు. కానీ ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు జరగకపోవడం గమనార్హం.

కల్లాల్లో ధాన్యం.. రైతుల్లో దైన్యం!



» కొనుగోలు కేంద్రాల గడువు ముగియడంతో అన్నదాతల అవస్థలు

నాగాయలంక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల గడువు మార్చి 31తో ముగియటంతో మండలంలోని పలుగ్రామాల్లో ధాన్యం కల్లాల్లోనే ఉన్నాయి. మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలెం, పెదప్రోలు, పెదకళ్లేపల్లి గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి కుప్పలు, ధాన్యం ఉన్నాయి. గడిచిన పదిరోజులుగా నూర్పిడులు చేసిన ధాన్యం కల్లాల్లోనే గుట్టలుగా పోసి రైతులు కాపలా కాస్తున్నారు. కొనుగోలు కేంద్రాల గడువు ముగియటంతో రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేయటంలేదని రైతులు వాపోతున్నారు. మిల్లర్లు, దళారుల కోరిన ధరలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కె.కొత్తపాలెం గ్రామంలో ఇంకా 100 ఎకరాల్లో ధాన్యం కుప్పలు ఉన్నాయి. మండలంలో సాధారణంగా రైతులు ముఠా కూలీలపై ఆధారపడి ఒకరితర్వాత ఒకరు నూర్పిడి చేస్తుంటారు. అదే క్రమంలో రెండో పంటగా సాగుచేసిన మినుము వచ్చిన తర్వాత వరి నూర్పిళ్లు చేస్తుంటారు. ప్రస్తుతం మార్చి 31 వరకే ఖరీఫ్ ధాన్యం కొనుగోలు గడువు విధించటంతో రైతులు మిగిలి ఉన్న ధాన్యం ఏమి చేయాలో దిక్కుతోచటం లేదని ఆవేదన చెందుతున్నారు. మోపిదేవి మండలంలో 13వేల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయగా, ఇంకా 9500 మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఒక్క కె.కొత్తపాలెం గ్రామంలోనే 100 ఎకరాల వరి కుప్పలు నూర్పిడి చేయాల్సి ఉంది. ప్రస్తుతం రైతులు నూర్పిడి చేసిన ధాన్యం కొనుగోలు చేయాలంటూ గ్రామరైతు సేవా కేంద్రం, మండలస్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పది రోజులుగా ధాన్యాన్ని కల్లాల్లో కాపలా కాస్తున్నామని, ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఖరీఫ్‌పై పునరాలోచన చేసి మరో పది రోజులు కొనుగోలు కేంద్రాలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


నూర్పిడి చేసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

కొనుగోలు గడువు పొడిగించండి

- మత్తి వెంకట్రామయ్య, చందన కోటేశ్వరరావు



వారంరోజుల క్రితం ధాన్యం నూర్పిడి చేశాం. రైతుసేవా కేంద్రానికి వెళ్లగా, ప్రభుత్వం కొనుగోళ్ల నిలిపివేయటం జరిగిందని తెలిపారు. తహసీల్దార్, ఏవో కార్యాలయాల వద్దకు వెళ్లగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు. ప్రభుత్వం రూ.1740 ధరకు కొనుగోలు చేయగా, మిల్లర్లు, దళారులు రూ.1400 నుంచి రూ.1500లకు అడుగుతున్నారు. బస్తాకు రూ.300లు నష్టపోతున్నాం. ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం పునరాలోచనచేసి మరో పదిరోజులు సమయం పొడిగించి ధాన్యం కొనుగోలు చేయాలి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు



ఉంగుటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించడమే లక్ష్యంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ (వీహెచ్‌సీ)లద్వారా ప్రజలకు మెరుగైన, నాణ్యమైన ఆరోగ్య, వైద్య సేవలు అందించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయని జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఎన్‌క్వాస్) జిల్లా టీం సభ్యులు డాక్టర్ చైతన్య, డాక్టర్ సంధ్య అన్నారు. ఉంగుటూరు పీహెచ్‌సీ పరిధిలోని ముక్కపాడు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శుక్రవారం ఎన్‌క్వాస్ జిల్లా టీం సందర్శించింది. పీహెచ్‌సీ వైద్యాధికారిణి కాట్రగడ్డ వాణి, హెల్త్ సూపర్‌వైజర్ సాల్మన్‌రాజు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వంట గ్యాస్ ధర తగ్గించాలి

ఉయ్యూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర సరుకులతో పాటు విద్యుత్ చార్జీలు నింగినంటుతున్న తరుణంలో వంట గ్యాస్ ధర పెంచి కేంద్రప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెను భారం మోపిందని ఐద్వా నాయకురాలు బి కీర్తి ఆరోపించారు. పెంచిన వంట గ్యాస్ ధర తగ్గించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సుందరమ్మ పేటలో మహిళలతో కలసి నిరసన తెలిపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

గన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు తప్పవని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు సూరగాని సాంబశివరావు అన్నారు. ఏపీ రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో జెండాను అవుటపల్లి సాంబయ్య ఎగురవేశారు. నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, నక్కా రామయ్య, వై.నరసింహారావు, అంజనే యులు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, చిన్న, నాగేశ్వరరావు, చిటికెల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మామిడి నష్టానికి దరఖాస్తు చేసుకోవాలి

విజయవాడ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సంభవించిన గాలివానలకు పంటనష్టపోయిన మామిడి రైతులకు నష్టపరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) కోసం దరఖాస్తు చేసుకోవాలని నున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. అకాల వర్షంతో పంట దెబ్బతిన్న రైతులు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శనివారం ఉదయం నుంచి అధికా రులు అందుబాటులో ఉంటారని తెలియజేశారు.

జంక్షన్‌లో మెగా వైద్యశిబిరం రేపు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రవంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం ట్రస్టు కార్యాలయంలో వైద్యశిబిరం కరపత్రాన్ని రిటైర్డు ప్రిన్సిపాల్ డీవీ.రమణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి వీర మాచ నేని శ్రీదేవి,సభ్యులు వీరమాచనేని బుజ్జి, మేడేపూడి రామ్మోహన్‌రావు, జాస్తి భూపతి,కడగల శ్రీనివాసరావు, యమదల సుధాకర్, బొమ్ము లూరు సర్పంచ్ కె. విజయ భాస్కర్, అల్లంశెట్టి శ్రీనివాసరావు, గొట్టాపు వాసు, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ అత్యవసర సమావేశం

ఉయ్యూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఎజెండాలోని పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్మన్ వల్లభనేని సత్యానారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అత్యవసర సమావేశంలో అంతర్గత రోడ్ల నిర్మాణంతో ఇతర అభివృద్ధి పనులు, 2025-2026 సంవత్సరానికి సాధారణ బడ్జెట్ తీర్మానం ఆమోదించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి సత్కారం

గన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాబాద జడ్పీహైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు దామోదర గణపతిరావు ఉగాది కళారత్న హంస పురస్కారం సీఎం చంద్రబాబు చేతుల మీదుగా తీసుకున్న నేపథ్యంలో శుక్రవారం స్థానిక బాలుర హైస్కూల్‌లో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల తెలుగు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సత్కారం సభ జరిగింది. మెమెంటో, దుశ్శాలువ, పూలబొకేలతో ఘనంగా సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, జడ్పీటీసీ సభ్యురాలు అన్నావరపు ఎలిజబెత్ రాణి మాట్లాడారు. జీవి రవిబాబు, కెఎస్ జగదీశ్వరరావు, గుర్రం రాజా బాబు, రామ్‌గోపాల్, టీఎస్ఆర్‌కె ప్రసాద్, సాంబశివరావు, రామారావు పాల్గొన్నారు.

నేటి నుంచి తేలప్రోలు రంగమ్మ తిరునాళ్ల

ఉంగుటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తేలప్రోలు శ్రీరంగమ్మ పేరంటాలు మహోత్సవాలు (తిరునాళ్లు) ఈ నెల 12వ తేదీ శనివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయవారసులు, జక్కాసోదరులు చంద్రశేఖర్, ఉదయ్, రమేష్ తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జక్కావారి ఇంటి ఆడపడుచు, మహిమాన్వితురాలైన శ్రీరంగమ్మ పేరంటాల తిరునాళ్లు ప్రతిఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి మంగళవారం వరకు నాలుగు రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయన్నారు.

ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటిపన్నులు, నీటి కుళాయిపన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వల్లూరి సూర్యప్రకాష్‌నాథ్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో పాతబకాయిలు వసూలు అయినట్లు తెలిపారు. అన్ని గ్రామాల కార్యదర్శులు ఆయాగ్రామాల్లో పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని, ఈ నెల 20నాటికి నూరుశాతం వసూళ్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకారం అందించాలని ఆయన కోరారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

ఉంగుటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, రబీ సీజన్ ముగిసిన నేపథ్యంలో గ్రామాల్లో కూలీలు పనుల కోసం వలస పోకుండా ఉపాధి హామీ పథకం ద్వారా స్థానికంగానే పనులు కల్పిస్తున్నామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో టి.వినీల అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా ఉపాధి పథకం కింద 110రకాల పనులు జరుగుతున్నాయని, ప్రతిరోజూ 3400 మంది కూలీలు పనుల్లో పాల్గొంటున్నారని పనిప్రదేశంలో కూలీలు నీరసించి పోకుండా ఫీల్డ్‌అసిస్టెంట్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో వుంచామన్నారు.

కూటమి పాలనలో మహిళలకు ప్రాధాన్యం

కంకిపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో మహిళలకు సముచితస్థానం లభిస్తోందని టీడీపీ జిల్లా కార్యదర్శి, ఏఎంసీ చైర్మన్‌గా ఎంపికైన అన్నే ధనయ్య అన్నారు. ఏఎంసీ వైస్ చైర్ పర్సన్‌గా ఎంపికైన మల్లెంపల్లి కళ్యాణిని శుక్రవారం ఆయన కోల వెన్ను గ్రామంలో ఆమె ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి అభి నందించి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు కొండవీటి శివయ్య, పడవల మధుసూదనరావు, బొబ్బ శ్రీనివాసరావు, వల్లభనేని రాంబాబు, కంచర్ల శేషగిరి, తట్టకూరి సురేష్, జోగా ఆదినారాయణ, ఉప్పలపాటి శివ నాగమల్లేశ్వరరావు, భోగా సోములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు గుడివాడ ఏఈ జి.బి. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 12గంటల వరకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంకిపాడు : మండలంలోని ఈడుపుగల్లు, మద్దూరు, కోలవెన్ను గ్రామాల పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్ల మరమత్తుల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్న మండల విద్యుత్ శాఖ అధికారి అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- నియోజకవర్గాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



పాత గన్నవరంలో సీసీరోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్‌వన్ స్థానంలో నిలబెడతా అన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు తీసుకువెళుతున్నట్లు తెలిపారు. గన్నవరం పట్టణంలో ఎన్ఆర్ఈజీఎస్, గ్రామ పంచాయితీ నిధులు రూ.1.90 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, మండల పరిషత్ కాంపౌండ్ వాల్‌ను శుక్రవారం కూటమి నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో 2014-19 మధ్య కాలంలో జరిగిన అభివృద్ధి తప్ప గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏమి చేయలేదన్నారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతో గ్రామాల్లోని అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడ నాడు వెల వెలబోతే చంద్రబాబు సీఎం కాగానే పారిశ్రామిక వేత్తలు పరుగులు తీస్తూ వస్తున్నారని తెలిపారు. మూతబడిన అశోక్ లేల్యాండ్‌ను పునఃప్రారంభించటంతో ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు వచ్చాయన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడలో త్వరలో పూర్తిస్థాయిలో పరిశ్రమలో ఏర్పాటు కానున్నాయన్నారు. 15వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చానని ఆ మేరకు నిలబెట్టుకుంటున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఉపసర్పంచ్ పాలడుగు నాని, ఎంపీటీసీలు మద్దినేని వెంకటేశ్వరరావు, పడ మట రంగారావు, టీడీపీ టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, దేవినేని సులోచన, దమయంతి, కాసన్నేని రంగబాబు, జాస్తి ఫణిశేఖర్, చిమట రవివర్మ, చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో స్వర్ణలత, పంచాయితీ కార్యదర్శి చెన్నకేశవులు, ఏఈలు దాసు, వెంకటరాజు, సుజాత పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య సంరక్షణకు సీఎంఆర్ఎఫ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పేదలకు అవసరమైన వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్య సంరక్షణకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడలోని కార్యాల యంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను శుక్రవారం ఆయన అందజేశారు. బాపులపాడు మండలానికి చెందిన కొనరాజు విజయ దుర్గకు రూ. 70వేలు, విజయవాడ రూరల్ మండలానికి చెందిన మేకల కరుణబాబుకు రూ.4లక్షల సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందజేశారు.



గన్నవరం, ఉయ్యూరులో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పీటీడీ ఉద్యోగుల ధర్నా

గన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదుట శుక్ర వారం రెండవ రోజు కూడా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎంయుఏ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి మాట్లాడుతూ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలన్నారు. పారదర్శకమైన బదిలీల పాలసీని అమలు చేయాలన్నారు. డిపో కార్యదర్శి శ్రీనివాసరావు, ఆంజనేయులు, ఉషారాణి, నాని, బాజీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : రాష్ట్ర వ్యాప్తంగా పీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పీటీడీ ఉయ్యూరు డిపో కార్యదర్శి పీఎం కృష్ణ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేర రెండో రోజు శుక్రవారం ఉయ్యూరు ఆర్టీసీ డిపో గ్యారేజి గేటు ఎదుట సమావేశం నిర్వహించి నిరసన తెలిపారు. అసోసియేషన్ డిపో అధ్యక్షు డు కేఎస్ రావు, అసిస్టెంట్ సెక్రటరీ అరుణోదయ, ఎస్ రాము, ట్రెజరర్ బీఎస్ రావు, పబ్లిసిటీ సెక్రటరీ షఫీ, పిచ్చయ్య పాల్గొన్నారు.



కోలవెన్ను చెన్న మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న చలసాని కుటుంబీకులు

ఘనంగా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం

కంకిపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలవెన్ను చెన్న మల్లేశ్వరస్వామి దేవాలయంలో మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు చలసాని సురేష్, చలసాని అరుణ ప్రసాద్, చలసాని కిషోర్, చలసాని పూర్ణ, చలసాని వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా స్వామి వారులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. శనివారం ఉదయం 8.30 నుంచి 12.30 గంటల వరకు వీరభద్ర పూజలు, వీరభద్ర పల్లెం వీరంగాలు, ఊరేగింపు నిప్పులగుండం వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు భక్త్వేశ్వరరావు తెలిపారు.

16న మంతెన మల్లేశ్వరస్వామి భూముల వేలం

మంతెన మల్లేశ్వరస్వామి భూముల వేలం ఈ నెల 16న నిర్వహించనున్నట్లు ఈవో ఎం. శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ, ఈ నెల 16న భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయానికి చెందిన 7.26 ఎకరాలు, 6.97 ఎకరాలు, వేణుగోపాలస్వామి దేవస్థానం పరిధిలోని సుమారు 12.49 ఎకరాల భూమిని ఈ నెల 16న ఉదయం 10 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో దేవాదాయ అధికారుల పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

క్షేత్రస్థాయిలో పరిశీలించిన ట్రాపిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్

గుణదల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి నిడమానూరు వరకు తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఏరకమైన చర్యలు తీసుకోవాలన్నదానిపై ట్రాపిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్ క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలన చేశారు. రామవరప్పాడు రింగ్ నుంచి ఆయన కాలి నడకన నిడమానూరు వరకు వెళ్లి ఎక్కడెక్కడ ఏరకమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉందన్నది ముందుగా పరిశీలించారు. రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్న చోటనే ప్రమాదాలు జరుగుతున్నట్లుగా గుర్తించారు. కొన్ని చోట్ల పాదచారులు నడిచేందుకు వీలు లేకుండా పుట్‌పాత్‌లపై హాకర్లు ఆక్రమించడాన్ని ఆయన గమనించారు. ఈ కార్యక్ర మంలో ట్రాఫిక్ సీఐలు బాలమురళీకృష్ణ, కిషోర్‌బాబు, రమేష్‌బాబు, ఎస్ఐ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదంపాడు వద్ద పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్, ట్రాఫిక్ సీఐలు బాలమురళీకృష్ణ, కిషోర్‌బాబు, రమేష్‌బాబు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నిరసన

విజయవాడ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ శుక్రవారం నున్న రైతు సేవా కేంద్రం ఎదుట రైతులు నిరసన తెలిపారు. పండించిన పంటను కోసి వారాలు గుడుస్తున్నా ప్రభుత్వం, అధికారులు కొనుగోలు చేయకపోవడంలో జాప్యం చేస్తున్నారని తద్వారా రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పంట కొనుగోలుకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతూ వ్యవసాయ గ్రామ సహాయ అధికారులు బిందు, మౌనికలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యార్కా రెడ్డి నాగిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి పొలారెడ్డి, గ్రామ రైతులు యార్కారెడ్డి బుజ్జి, చాగంటి వెంకటరెడ్డి, కలకోటి శ్రీనివాసరెడ్డి, దండు సుబ్రహ్మణ్యరాజు పాల్గొన్నారు.



గన్నవరంలో మెట్రో రైల్ ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న మెట్రో రైల్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రంగారావు, ఆర్డీవో బాలసుబ్రమణ్యం

మెట్రో కోచ్ ఏర్పాటుకు పరిశీలన

గన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గన్నవరం రైతు బజార్ నుంచి కేసరపల్లి జంక్షన్ వరకూ మెట్రో కోచ్ ఏర్పాటుకు జాయింట్ ఇన్‌స్పెక్షన్‌ను అధికారులు శుక్రవారం నిర్వహించారు. మెట్రో ట్రైన్ చీఫ్ ఇంజనీర్ రంగారావు, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో కలసి గన్నవరం నుంచి కేసరపల్లి వరకు పరిశీలన చేశారు. 4.5 కిలో మీటర్లు మెట్రో కోచ్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ తదితర అంశాలను చర్చించారు. నాలుగు స్టేషన్‌లు కలిపి సుమారు మరో పది ఎకరాలు అవసరం అవుతుందని భావిస్తున్నారు. మెట్రో ప్రాజెక్టుకు సుమారు రూ.400 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు వేశారు. తహసీల్దార్ కేవీ శివయ్య, మండల సర్వేయర్ మాధవరావు, ఆర్అండ్‌బీ ఏఈ బలరాం, విద్యుత్ శాఖ ఏఈ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

జ్యోతిరావు పూలే సేవలు యువతకు ఆదర్శం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సంఘ సంస్కర్త, రచయిత, తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే సమాజానికి చేసిన సేవలు యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం తాడిగడప సెంటరులో పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే విశేష కృషి చేశాడని కొనియాడారు. టీడీపీ కూటమి నేతలు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ఉయ్యూరు : వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని పలువురు కీర్తించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్ర వారం జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ శేషగిరిరావు, కార్యాలయ ఉద్యోగులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు.

గన్నవరం : ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతిరావ్‌పూలే అని ఏపీ పీటీడీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంకం చిట్టిబాబు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మహాత్మ జ్యోతి రావ్ పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావ్‌పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హనుమాన్‌జంక్షన్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అఖిల పక్షనేతలు జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. జ్యోతి రావు చిత్రపటానికి మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, చింతల అప్పారావు, వడ్డి నాగేశ్వరరావు, కొల్లిపర వరప్రసాద్, రాఘవేంద్రరావు, షేక్ అహమ్మద్, సాంబశివరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎస్ఎస్సీ ఎల్బీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెం, కోడూరుపాడులో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు.



ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవంలో ఇన్నర్‌వీల్ మిడ్‌టౌన్ క్లబ్ సభ్యులు

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

విజయవాడ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పి. నైనవరంలోని ఎంపీయూపీ స్కూల్‌లో తాగునీటి అవసరాల నిమిత్తం ఇన్నర్ వీల్‌క్లబ్, విజయవాడ మిడ్‌టౌన్ సహాయంతో శుక్రవారం ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించారు. గతంలో ఉన్న ప్లాంట్ మరమ్మతులకు గురవడంతో క్లబ్ సభ్యులు రూ. 17 వేలతో ప్లాంట్‌ను పునరుద్ధరించి విద్యార్థులకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. క్లబ్ సభ్యులు కె. సంధ్యా రాణి, కె. భవానీ, హెచ్ఎం చెరుకుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



నయనానందకరం!

రామవరప్పాడు రింగ్‌లో లవ్ మన విజయవాడ సర్కిల్ ఉంది. అందులో ఫౌంటెయిన్, గ్రీనరీ నగర వాసులకు ఆహ్లాదాన్ని పంచుతుంటాయి. ఆ సర్కిల్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో నూతనంగా ఓ ఎగురుతున్న గుర్రం విగ్రహాన్ని అందులో ఏర్పాటు చేశారు. నయనానందకరంగా ఉన్న ఆ విగ్రహం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. -విజయవాడ, ఆంధ్రజ్యోతి



ర్యాలీలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

తల్లిని సంరక్షించుకుందాం

- జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు

భారతీనగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రసవ సమయంలో ఏ ప్రమాదం జరగకుండా ప్రతి తల్లిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నాలుగో డివిజన్‌లోని ఏపీసీ కాలనీలోని పట్టణ ఆరోగ్యకేంద్రం వద్ద జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆధ్వర్యంలో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీని శుక్రవారం వారు ప్రారంభించారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి గురునానక్ రోడ్డు వరకు నర్సింగ్ విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. వివాహం అనంతరం కాబోయే తల్లులకు సాధారణ డెలివరీ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారని కలెక్టర్ అన్నారు. గర్భధారణ, ప్రసవం, ప్రసవానంతర కాలంలో మహిళలకు ఆరోగ్య సంరక్షణ విధానాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పాత ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్.శోభ, సీడీపీవో ఎం.మంగమ్మ, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ మోతిబాబు, డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శ్రావణి, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.





గ్రావిటీ కెనాల్, కొండవీడు వాగులో పనులు చేస్తున్న యంత్రాలు

వరద దుర్భేద్యం

అమరావతిలో శరవేగంగా ముంపు నివారణ పనులు

- ప్రారంభమైన కొండవీటివాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్ విస్తరణాభివృద్ధి
- సమాంతరంగా రిజర్వాయర్ల పనులు.. వాటికి కాలువల అనుసంధానం





పనులను పరిశీలిస్తున్న ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి, పాలవాగులో జరుగుతున్న పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతికి శాశ్వతంగా వరద ముంపు తలెత్తకుండా అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) నేతృత్వంలో భారీ ఎత్తున రాజధానిలో వరద ముంపు నివారణ పనులు జరుగుతున్నాయి. దుర్భేద్యమైన వరదనీటి కాలువలు, రిజర్వాయర్లను నిర్మించడం ద్వారా ఎంత భారీ వర్షం కురిసినా నీరు అమరావతి నగరాన్ని ముంచెత్తకుండా విస్తరాణాభివృద్ధి పనులు చేస్తున్నారు. నీరుకొండ, పాలవాగు, గ్రావిటీ కాలువల విస్తరణాభివృద్ధి పనులతో పాటు ఏకకాలంలో 3 ప్రధాన రిజర్వాయర్ల పనులు మొదలయ్యాయి. కొండవీడు వాగు విస్తరాణాభివృద్ధి పనులు ముందుగా ప్రారంభమయ్యాయి. 20 ఎక్స్‌కవేటర్లతో శరవేగంగా ఈ పనులు సాగుతున్నాయి. 80 లారీలు ఇక్కడి నుంచి తవ్విన మట్టిన తరలిస్తున్నాయి. అనంతవరం నుంచి ఉండవల్లి వరకు వచ్చే కొండవీడువాగు ప్రస్తుతం కొన్ని చోట్ల 10 అడుగులు మరికొన్ని చోట్ల 4 అడుగుల లోతున ఉందని ఇటీవల ఏడీసీ సీఎండీ ప్రకటించిన సంగతి తెలిసిందే. కొండవీడు వాగులో 75 మీటర్ల లోతు, 115 మీటర్ల వెడల్పుతో విస్తరణాభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం శాఖమూరు నుంచి ఈ పనులు జరుగుతున్నాయి. ఐనవోలు గ్రామం పరిధిలో కూడా కాలువ విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ కాలువను నీరుకొండ దగ్గర అభివృద్ధి పరిచే రిజర్వాయర్‌కు అనుసంధానం చేస్తారు. కొండవీడు కాలువ నీరుకొండ రిజర్వాయర్‌కు అనుసంధానమయ్యేలా ప్రస్తుతం పనులు చేపడుతున్నారు. నీరుకొండలోనూ రిజర్వాయర్ పనులు ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నారు. పాలవాగు విస్తరణాభివృద్ధి పనులు కూడా సమాంతరంగా మొదలయ్యాయి. పాలవాగు దొండపాడు నుంచి కృష్ణాయపాలెం మీదుగా కొండవీడు వాగులో కలుస్తుంది. పాలవాగు పనులు ప్రస్తుతం ఎన్-9 రోడ్డు బ్రిడ్జి ఎడమ వైపున జరుగుతున్నాయి. ఇక్కడ 8 ఎక్స్‌కవేటర్లు మట్టిని తవ్వుతుండగా..మొత్తం 30 లారీలు తవ్విన మట్టిని తరలిస్తున్నాయి. గ్రావిటీ కెనాల్ పనులను కూడా కాంట్రాక్టు సంస్థ చేపట్టింది. గ్రావిటీ కెనాల్ వైకుంఠపురం వెంబడి వెళుతుంది. భారీ సంఖ్యలో ఎక్స్‌కవేటర్లు, లారీలను దించి కాంట్రాక్టు సంస్థ చకచకా కాలువ విస్తరణాభివృద్ధి పనులు చేపడుతోంది.

నీరుకొండ దగ్గర 0.4 టీఎంసీల సామర్థ్యం రిజర్వాయర్ పనులు ఇప్పటికే జరుగుతున్నాయి. కృష్ణాయపాలెం దగ్గర 0.1 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్, శాఖమూరు దగ్గర 0.01 టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్, వైకుంఠపురం దగ్గర 0.03 టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్, రాజధాని బయట కూడా మరో 0.03, 0.2 టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లను అభివృద్ధి చేయనున్నారు.

వైభవోపేతంగా..

నంది వాహనంపై గంగాపార్వతీ సమేత మల్లేశ్వరుల ఊరేగింపు



నంది వాహన సేవలో పాల్గొన్న ఉద్యోగులు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలుగో రోజు శుక్రవారం నంది వాహనంపై గంగా పార్వతీ(దుర్గ) సమేత మల్లేశ్వరులు నగర వీధుల్లో వైభవంగా ఊరేగారు. ఉదయం వేద పండితులు, అర్చకులు మూల మంత్ర హవనములు నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఔపాసన, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, ఇతర వైదిక కార్యక్రమాలతో పాటు ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి మల్లేశ్వర మహామండపం నుంచి గంగా పార్వతి సమేత మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన నంది వాహనంపై ఊరేగారు. సంప్రదాయ కళలైన తప్పెట్లు, మహిళల కోలాట నృత్యాలు, చిన్నారుల కోలాట ప్రదర్శన, తాళం భజన ప్రదర్శన ముందుకు సాగుతుండగా, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నంది వాహన సేవ శ్రేణి కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కొత్తపేట, సామారంగం చౌక్, మెయిన్ బజార్ మీదుగా తిరిగి కొండపై వరకు ఊరేగింపు కొనసాగింది. ఆది దంపతులు వేంచేసిన నంది వాహనం ముందు ఆయా ప్రాంతాల్లో మహిళలు పసుపు నీళ్లతో శుద్ధిచేసి, హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.సత్యనారాయణ ప్రసాద్, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్, ఆంధ్రజ్యోతి పబ్లిషర్ కోగంటి వెంకట శేషగిరిరావు

న్యాయవాదుల సేవలు అభినందనీయం

సత్యనారాయణపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సమాజంలో న్యాయవాదులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యుడు, ఆల్ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. న్యాయవాద వృత్తిలో అవిర్నేని శ్రీనివాస్ శ్యామ్‌సుందర్ పాతికేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, అమరావతి లీగల్ అకాడమీ 5వ వార్షికోత్సవం, అవిర్నేని శ్రీనివాస్ శ్యామ్‌సుందర్ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం మానేపల్లి వారి వీధిలోని ఓ హోటల్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. అవిర్నేని శ్రీనివాస్ న్యాయవాదిగా పాతికేళ్లుగా సమాజానికి సేవచేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారని వక్తలు పేర్కొన్నారు. లాభాపేక్ష లేకుండా పాతికేళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉంటూ, అమరావతి లీగల్ అకాడమీ ద్వారా జూనియర్ లాయర్లకు ఆన్‌లైన్‌లోను, ఫిజికల్‌గా, న్యాయమూర్తి పరీక్షలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయం అని ఆంధ్రజ్యోతి పబ్లిషర్ కోగంటి వెంకట శేషగిరిరావు అన్నారు. అవిర్నేని శ్రీనివాస్ శ్యామ్‌సుందర్‌ను సన్మానించారు. ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.సత్యనారాయణ ప్రసాద్, కేఎల్‌యూఎఫ్ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ పవన్‌కుమార్, ఎంఏయం లా కాలేజీ ప్రిన్సిపాల్ వీరబ్రహ్మయ్య, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా పాల్గొన్నారు.



ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

- ప్రజలందరూ భాగస్వాములవ్వండి
- సీపీఎం నేత సీహెచ్ బాబూరావు పిలుపు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని, పార్టీలకతీతంగా ప్రజలందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. సీపీఎం నగర కమిటీ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్‌లో నిర్వహించారు. సమావేశానికి బి.రమణరావు అధ్యక్షత వహించారు. నగర ప్రజల సమస్యలపై చర్చ జరిపారు. ఇళ్ల పట్టాలు, మంచినీరు, డ్రైనేజీ, పౌర సమస్యలు, కాలుష్యం, గంజాయి, మత్తు పదార్థాలు, ప్రజలపై భారాలు తదితర సమస్యలపై భవిష్యత్తులో ఉద్యమాలు నడపాలని సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ మీటర్లను తిప్పి కొట్టాలని సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. దీనిపై ఇంటింటికీ స్టిక్కర్లు, కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల రూపంలో ప్రజలపై భారాలు వేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.కాశీనాథ్, కె.శ్రీదేవి, నగర నేతలు బోయి సత్యబాబు, పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పీడు పెంచండి

విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూ సేకరణ జరిగింది 60 శాతమే

- మిగిలిన భూములను త్వరగా అప్పగించాలంటూ ఎన్‌హెచ్ లేఖ
- త్వరగా పెండింగ్ గజిట్‌లు పూర్తి చేసి భూములు అప్పగించాలని అభ్యర్థన
- మరో 20 శాతం భూములు ఇస్తేనే పనులు చేపట్టడానికి అవకాశం
- ఇప్పటికే ఖరారైన ప్యాకేజీ-3 పనులు .. మేఘా సంస్థకు దక్కిన కాంట్రాక్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి భూ సేకరణలో ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పీడ్ పెంచాల్సిన అవసరం ఉంది. త్వరితగతిన మాకు భూములు అప్పగించాలంటూ ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగానికి ఖమ్మం జిల్లాకు చెందిన ఎన్‌హెచ్ అధికారులు లేఖలు రాసే పరిస్థితి వచ్చింది. ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అప్పగించాల్సిన 245 ఎకరాల్లో 60 శాతం భూములను మాత్రమే సేకరించి ఇచ్చింది. ఇంకా 40 శాతం భూములను సేకరించి ఇవ్వాలి. కనీసం మరో 20 శాతం మేర భూములను అయినా సేకరించి ఎన్‌హెచ్ అధికారులకు అప్పగించగలిగితే.. 80 శాతం భూములు వచ్చాయన్న క్లాజ్‌లో కాంట్రాక్టు సంస్థ పనులు మొదలు పెట్టడానికి అవకాశం ఉంది. ఖమ్మం జిల్లా నుంచి విజయవాడ జక్కంపూడి వరకు 30 కిలోమీటర్ల దూరానికి పనులు చేపట్టాల్సి ఉంది. విజయవాడ-నాగ్‌పూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ రహదారి అత్యంత ప్రాముఖ్యత పోషించనుంది. నాలుగు వరసలతో నిర్మించే ఈ హైవే ప్రాజెక్టుకు ఇంతకు ముందే టెండర్లు కూడా పిలిచారు. మేఘా సంస్థ ఈ పనులను దక్కించుకుంది. పనులు చేపట్టాలంటే 80 శాతం భూ సేకరణ జరగాలి. ఇప్పటికే విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భాగంగా ఖమ్మం జిల్లాలో రెండు ప్యాకేజీల పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. ఎటొచ్చీ ఎన్టీఆర్ జిల్లాలోనే ప్యాకేజీ-3 పనులు మిగిలిపోయాయి. తాజాగా ఎన్‌హెచ్ అధికారులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు రాసిన లేఖలో రైతుల నుంచి భూములను తీసుకోవటానికి వీలుగా తాము రూ.74.49 కోట్లను కేటాయించామని త్వరితగతిన స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా 9.24 హెక్టార్ల భూమిని అప్పగించాలని కోరారు. జక్కంపూడి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న 3ఏ గెజిట్ ప్రచురణను వేగంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో 9.04 హెక్టార్ల 3డీ గజిట్ ప్రచురణ కూడా త్వరగా పూర్తి చేయాలని కోరారు.

కళారత్న పురస్కార గ్రహీతలకు సత్కారం



దామోదర గణపతిరావు, రామకూరి (రంగం) రాజేష్, డాక్టర్ కమ్ముల శేషుకుమార్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తెలుగు కళావాహిని, జీ ఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళా భారతి, రాగ సుధామయి క్రియేషన్స్ నిర్వహణలో కౌతా వారి కళా వేదికపై శుక్రవారం సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో కళారత్న పురస్కార గ్రహీతలు దామోదర గణపతిరావు, రామకూరి (రంగం) రాజేష్, డాక్టర్ కమ్ముల శేషుకుమార్‌ను సత్కరించారు. కళలకు కాణాచి విజయవాడలో కూటమి ప్రభుత్వ పాలనలో కళా ప్రదర్శనలు ఊపందుకున్నాయని, కళలు విలసిల్లిన చోట సుభిక్షంగా ఉంటుందని అమరావతి సచివాలయం ఓఎస్డీ డాక్టర్ ప్రభాకర్ అన్నారు. చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు.

అగ్నివీర్ ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు

విద్యాధరపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భారత సైనిక దళంలో అగ్నివీర్ ద్వారా చేరుటకు ఆన్‌లైన్ గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు అమ్మ కాన్సెప్ట్ ఫౌండర్, సీఈవో ఎల్.కె.చిన్నప్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అగ్నివీర్ ద్వారా భారత సైన్యంలో చేరాలనే ఆసక్తిగల యువతీ, యువకులకు 21 సంవత్సరాలు నిండి ఉండాలని తెలిపారు. 10వ తరగతి, 8వ తరగతి చదివి ఉండాలని ఆయన తెలిపారు. అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకునే వారికి సందేహాలు ఉంటే అమ్మ కాన్సెప్ట్ సంస్థ నిర్వాహకుల ద్వారా గానీ, 94402 51373, 88014 33611 నెంబర్లకు ఫోన్ చేసిగానీ సంప్రదించాలని ఆయన సూచించారు.

సెపక్ తక్రా పోటీలకు రాష్ట్ర విద్యార్థులు

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-17 సెపక్ తక్రా పోటీలకు రాష్ట్ర విద్యార్థులు ఎంపికయ్యారని, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. ఈ నెల 15 నుంచి 21వరకు మణిపూర్‌లోని ఇంఫాల్ శాయ్ సెంటర్లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన బాలబాలికల జట్లకు కోచ్‌లుగా ఎస్.రమేష్, ఎం.సంతోషి కుమారి, డి.సుంకరరావు వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు అభినందించారు. విజయాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తదితరులు

పేదలకు సాయమందిద్దాం

- మార్గదర్శి - బంగారు కుటుంబం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు



విజయవాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దాంట్లో కొంత పేదలకు ఖర్చు చెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులో నిర్వహించిన మార్గదర్శులు - బంగారు కుటుంబం కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. సభలో పాల్గొన్న నగరానికి చెందిన పలువురు మార్గదర్శులు బంగారు కుటుంబాలకు చేయూతనందిస్తామన్నారు. అవి వారి మాటల్లోనే..

పిల్లలకు ఉచితంగా చదువు చెబుతాం

నేను స్థాపించిన హ్యాపీవ్యాలీ స్కూల్‌ను మీరే ప్రారంభించారు. వంద కోట్లు అప్పు చేసి స్కూలు కట్టించాను. ఆ అప్పంతా తీర్చాను. మేము 300 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నాం. వారు మంచి జీవితాన్ని ప్రారంభించేదాకా బాధ్యత తీసుకుంటాం. మీరు ఇచ్చే పిలుపుతో మరిన్ని కార్యక్రమాలు చేపడతాం.

- గౌతమ్, హ్యాపీ వ్యాలీ స్కూల్ అధినేత

ఆణిముత్యాలకు అండగా ఉంటాం

ఈ కార్యక్రమం ద్వారా మట్టిలో ఆణిముత్యాలను వెలికి తీసి ఉద్యోగాలు ఇస్తాం. పిల్లలను చదివించేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. - నితిన్ కృష్ణ, నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్

ఉచిత చదువు అందించటానికి సిద్ధంగా ఉన్నాం

తోటపల్లిలో హీల్ ప్యారడైజ్ పాఠశాల ద్వారా వెయ్యి మంది అనాథ పిల్లలకు చదువు అందిస్తున్నాం. ఎవరైతే తమ పిల్లల్ని చదివించుకోలేని వారుంటారో వారికి ఉచితంగా చదువు చెప్పటానికి మేము సిద్ధంగా ఉన్నాం.

- పిన్నమనేని ధన ప్రకాశ్, మోడల్ డెయిరీ

పేద కుటుంబాలను దత్తత తీసుకుంటాం

నాకు చంద్రబాబే మార్గదర్శి. చంద్రబాబు చెప్పి చేసేవన్నీ చూసి నేర్చుకున్నాం. అరవై మందితో ప్రారంభమైన మా కాలేజీలో నేడు 6 వేల మంది చదువుకుంటున్నారు. ఎక్కువ కుటుంబాలను దత్తత తీసుకుని వారి బాగోగులను చూస్తాం.

- రావి వెంకటరావు, ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్

గంజాయి పట్టివేత

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి మచిలీపట్నానికి వ్యాన్‌లో తరలిస్తున్న గంజాయిని శుక్రవారం మూడు స్తంభాల సెంటర్‌లో చిలకలపూడి పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. గంజాయిని చిలకలపూడి సీఐ నబి, ఇనకుదురు పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై డీఎస్పీ రాజా ఆరా తీశారు. పూర్తి వివరాలు శనివారం వెల్లడిస్తామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.లక్షల్లో ఉంటుందని తెలిసింది. చాలా కాలంగా మచిలీపట్నం వైఎస్ఆర్ నగర్, ఎన్టీఆర్ నగర్, పోతేపల్లి ప్రాంతాల్లో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. కార్మికులతో పాటు విద్యార్థులు గంజాయికి అలవాటుపడ్డారు. ఇటీవల ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ పోలీసులతో నిర్వహించిన సమావేశంలో కృష్ణాజిల్లాను గంజాయి రహిత జిల్లాగా చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. దీంతో సివిల్ పోలీసులు గట్టి నిఘా పెట్టారు. మూడు స్తంభాల సెంటర్‌లో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఘనంగా వీరమ్మతల్లి వార్షిక జాతర

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగుబంగారం మామిడికోళ్ల వీరమ్మతల్లి అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం శుక్రవారం మామిడికోళ్లలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గద్దెపూజ, అభిషేకాలు, జమీపూజ వంటి ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి 10 గంటల నుంచి రంగురంగుల విద్యుద్దీప కాంతులతో అలంకరించిన వీరమ్మతల్లి ప్రభ బళ్లు, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కనకడప్పులు, బాణాసంచా కాలుస్తూ గ్రామమంతా మార్మోగేవిధంగా కన్నులపండుగగా గ్రామోత్సవం నిర్వహించారు.



వీరమ్మతల్లి జాతరలో పాల్గొన్న భక్తులు

ఫూలే నేటితరానికి స్ఫూర్తిదాయకం

● జ్యోతిరావుఫూలే విగ్రహాలకు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధుల నివాళులు



ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రావి

గుడివాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిరావుఫూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రజావేదికలో మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి శుక్రవారం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, నాయకులు రాంబాబు, వెనిగండ్ల రామకృష్ణ(నాని), జగన్మోహనరావు, కంచర్ల సుధాకర్, సింగవరపు ప్రభాకర్, పొట్లూరు కృష్ణారావు, పెద్దు వీరభద్రరావు, కోటి, పోతురాజు, గొర్ల శ్రీలక్ష్మీ, అనీల్, ఆదినారాయణ, శివశంకర్, కృష్ణయ్య, పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పార్టీ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, కొలుసు రాజా, వై.శ్రీనివాసరావు, పూర్ణ, షరీఫ్, దుర్గారావు, రమణ, వినోద్, సాయికృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగడాల సతీష్, ఎర్రపోతు అర్జున్, చిన్న, గానుగుల రాజా, బోనం గోపిక, కిరణ్, రీటా తదితరులు పాల్గొన్నారు.

ముగ్గు బజారులోని జ్యోతిరావుపూలే దంపతుల విగ్రహాలకు తారకరామా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మెరుగుమాల బ్రహ్మయ్య, గంగాధరరరావు, బలరాం, చిన్న నారాయణరెడ్డి, సుధారాణి, వీరశేఖర్, రామ్మోహనరావు, మల్లిక్, సామి రామ్మోహన్, శైలజ, కేశవరావు,శ్రీనివాసరావు, సత్యనారాయణ, సురేంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర బీసీ చైతన్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ముగ్గు బజారులోని పూలే దంపతుల విగ్రహాలకు సంఘం అధ్యక్షులు వేముల బేబిరాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు వెంకటమల్లేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొలుసు రాజా, అగస్తి ఆదివిష్ణు, బోయిన సోమశేఖర్, నైనవరపు శేషు, శ్రీనివాస్, సత్యనారాయణ, డా.శ్యామ్, దుర్గాప్రసాద్, మోహనరావు, గుల్లిపల్లి ప్రభాకర్, లోయ రాధాకృష్ణ, వీర్ల వెంకటేశ్వరరావు, కొలుసు కృష్ణారావు, నాగరాజు, కె.శ్రీనివాసరావు, పాల్గొన్నారు



గుడివాడరూరల్‌లో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో విష్ణు ప్రసాద్

గుడివాడ రూరల్ : ఎంపీడీవో కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డీవై విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆశయాలు, ఆకాంక్షలు ఆయన జీవిత చరిత్ర నేటి తరానికి ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : జ్యోతీరావుపూలే జయంతిని గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలులు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.విజయసారథి, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో పూలేకి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో విజయసారథి

కూచిపూడి: సంఘ సంస్కర్త మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాలను మొవ్వ మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ మస్తాన్, ఆర్‌ఐ విజయదుర్గ, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు. మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ బి.శివనాగేశ్వరరావు, అధ్యాపకులు ఎం.సుందరరావు, టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. మొవ్వ బస్టాండ్ ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, వెంకట రమణ తదితరులు పాల్గొని జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.



పామర్రులో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్

పామర్రు : సమసమాజ స్థాపనకు మహత్మజ్యోతీరావు పూలే తనజీవితాన్ని అంకితమిచ్చారని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికారప్రతినిధి కైలేఅనిల్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆపార్టీ కార్యాలయంలో శుక్రవారం మహత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ ఆపార్టీనేతలతోకలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఎ. రమాదేవి, ఇతరనేతలు పాల్గొన్నారు.



జనసేన ఆధ్వర్యంలో..

పమిడిముక్కల : వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని పలువురు కీర్తించారు. మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎంపీడీవో డి. వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కె.మహేశ్, కార్యాలయ ఉద్యోగులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అసమానతలు లేని సమాజం కోసం పూలే తపన, శ్రమ వెలకట్టలేనిదన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషిచేద్దామన్నారు. సుబ్రమణ్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా పెదపారుపూడిలోని గుర్విందపల్లిలో ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాసరావు (వంశీ) మహాత్మాగాంధీ, జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వంశీ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఒక భారతీయ సామాజిక సంస్కర్త, సామాజిక జ్ఞానోదయం కలిగించిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విజయ్, దుంగా రాజ్ కుమార్, దుంగా రాజేంద్ర ప్రసాద్, గోపాలం పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాసరావు



క్యాంపస్ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

ఏఎన్ఆర్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గుడివాడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో శ్రీచైతన్య ఈ-టెక్నో స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కళాశాలకు చెందిన 14 మంది ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ.జె.ఎస్. కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగాధిపతి కె.సుభాషిణి, టెక్నో స్కూల్స్ జోనల్ ఆఫీసర్ ఎం.అశోక్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

గుడివాడ : స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సుమారు 70 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్టు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మృతుని ఒంటిపై బూడిద రంగు టీషర్ట్, తెలుపు రంగు మాసిన గడ్డంతో ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు

గుడివాడ రూరల్ : మోటూరులో అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నహీమున్సీ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు. సర్పంచ్ పద్మ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ఆందోళన

పెదపారుపూడి : ఉపాధి కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ మోపర్రులో ఉపాధి కూలీలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. గత మూడు వారాలుగా పని చేస్తున్నా నేటికీ వారికి డబ్బులు చెల్లించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫానుకు వరి పంట పోయిందని, రెండవ పంట మినుము ధర లేకపోవటంతో కూలీ పనుల మీద ఆధారపడుతున్నామని తెలిపారు.

సేంద్రియ వ్యవసాయమే లాభదాయకం

● ఏడీఏ స్వర్ణలత

పామర్రు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతులద్వారా వ్యవసాయసాగు రైతులకు ఎంతో లాభదాయకమని పామర్రు వ్యవసాయశాఖ సహాయక సంచాలకురాలు బి.స్వర్ణలత అన్నారు. పామర్రు సబ్ డివిజన్ పరిధిలోని పామర్రు , కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడి ముక్కల , గుడ్లవల్లేరు మండలాల్లో రైతులు మినుమును సాగు చేశారన్నారు. ఆ పంటలను శుక్రవారం సేంద్రియ ఉత్పత్తుల జిల్లా ప్రాజెక్టు ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షరీఫ్ అహ్మద్‌తో కలసి పరిశీలించారు. రబీసాగులో వినియోగించిన మినుము విత్తనాలకు వినియోగించిన మందులు, ఇతర అవశేషాల పరీక్షల నిమిత్తం బెంగుళూరు పరిశోధన సంస్థకు పంపే నిమిత్తం శాంపిల్స్‌ను సేకరించామన్నారు. రైతులకు ఈ పద్ధతిలో సాగుచేయడంవల్ల ఆరోగ్యంతోపాటు అధికలాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏవో వి.శివనాగరాణి, కోండిపర్రు రైతుక్లబ్ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సాంకేతిక ఏవో గూడపాటి శ్రీదేవి, పలువురు రైతులు పాల్గొన్నారు.



విత్తన అవశేషాలతో రైతులు, అధికారులు

అనుమానాస్పదంగా వంటమాస్టర్ మృతి

వన్‌టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఓ డార్మిటరీలో ఉంటున్న వంటమాస్టర్ (60)అనుమానాస్పదంగా మృతి చెందినట్లు శుక్రవారం గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గుడివాడ సమీపంలోని నాగవరప్పాడుకు చెందిన యడ్లపల్లి ప్రసాద్ రెండు నెలల నుంచి విజయవాడ గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరామ రెసిడెన్సీ, డార్మిటరీలో ఉంటూ గాంధీనగర్ ఐలాపురం వెనుక సాయి బాలాజీ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను ప్రతి రోజూ ఉదయం డ్యూటీకి వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అతను డార్మిటరీలో పడిపోయి ఉండటంతో డార్మిటరీ సిబ్బంది 108 సిబ్బందికి సమాచారం తెలియపరిచారు. 108 సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి అతనిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డార్మిటరీ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



వంటమాస్టర్ యడ్లపల్లి ప్రసాద్

విద్యుత్‌కు అంతరాయం నేడు

గుడివాడ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. రామన్నపూడి, చిరుచింతల, బొమ్ములూరు, ఆటోనగర్ తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

పామర్రు: పామర్రులోని 132-33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ సాంకేతిక మరమ్మతుల దృష్ట్యా 12తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు మచిలీపట్నం విద్యుత్‌శాఖ ఈఈ జి.గోవిందరావు శుక్రవారం ఓప్రకటనలో వెల్లడించినట్టు పామర్రు డీఈఈ సుందరరావు తెలియజేశారు. దీనికి పామర్రులోని రాపర్ల, జమీదగ్గుమిల్లి, ఉండ్రపూడి, పోలవరం, ఊరుటూరు, కురుమద్దాలి, జుజ్జవరం, పసుమర్రు గ్రామాల్లోని వినియోదారులు సహకరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు కేసీపీ ప్రాంతీయ కార్యాలయం దగ్గర శుక్రవారం ఉయ్యూరు రోటరీ క్లబ్, రిజువాన్ మెడికేర్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కంటి, దంత పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు, ఈసీజీ, ఎకో టెస్టులు ఆయా విభాగాల డాక్టర్లు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం, కేసీపీ డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ వి రామకోటిరెడ్డి, రిజువాన్ ప్రతినిధులు లంక బాలాజీ పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి

గుడివాడ : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానంతోనే చట్టప్రకారం దర్యాప్తు చేయాలని కోరామని, అదేమైన తప్పా అని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఏ.ఐ.సి.సి) వ్యవస్థాపక అధ్యక్షులు, వైసీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జీన్‌బెన్నీ లింగం ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక గౌరీశంకరపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆదిమాంధ్ర సంఘం అధ్యక్షులు పొంగులేటి జయరాజు, మాలమహానాడు నాయకులు తంటేపూడి అనీల్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వినతి

గుడివాడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ మున్సిపల్ పాఠశాలలో ఖాళీ అయిన సంస్కృత ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సంస్కృత భాష వేదిక, భాషాభిమానులు కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ బి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు ఎర్రపోతు అర్జున్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతం పట్ల అవగాహన పెంపొందిచేలా పాఠ్యాంశాలు బోధించాలని కోరారు. దేశంలో ప్రజలు మాట్లాడే భాషలన్నింటికి మాతృభాష అయిన సంస్కృత భాషను పరిరక్షించుకునేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృత భాష వేదిక సభ్యులు పిన్నమనేని భవాని, భాషాభిమానులు కొత్త కిరణ్, ఆత్మలింగం, మోహన్, రాధా, కుమారి, బోనం గోపిక, దేవరపల్లి కోటి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సంస్కృత భాష వేదిక సభ్యులు

అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు నేటి నుంచి

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) :పెసరమిల్లిలో గ్రామ ప్రముఖులు వఱ్ఱే ఈశ్వరరావు జ్ఞాపకార్థం వారి సతీమణి మామిడికోళ్ల సర్పంచ్ వఱ్ఱే విజయలక్ష్మి, వారి కుమారులు వఱ్ఱే బలరామ్, వఱ్ఱే గంగాధర్(తిలక్)లు నూతనంగా నిర్మించిన ఆలయంలో అయ్యప్పస్వామి జన్మదినోత్సవ వేడుకలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠా కార్యక్రమం అనంతరం అన్నసమారాధన నిర్వహించనున్నామని తెలిపారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలు ఉపసంహరించుకోవాలి

పామర్రు : కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని పామర్రుశాఖ సీపీఎం కార్యదర్శి ఓడుగు గంగాధర్ డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్, చమురు ధరలను వ్యతిరేకిస్తూ పామర్రులోని నాలుగురోడ్ల కూడలిలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భీమేశ్వరరావు, విల్సన్, వి.పెదబాబు, రాజు, సీహెచ్. వేంకటేశ్వరరావు, రామ్మోహనరావు, బాబురావు పాల్గొన్నారు.

ఆలయ మండపానికి భూమిపూజ

తోట్లవల్లూరు : యాకమూరులో కోదండ రామస్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో నిర్మించనున్న ఆలయ మండపానికి శుక్రవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాదె కనకదుర్గ, గ్రామ ప్రముఖులు నూకల వెంకట సాంబశివరావు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం, ఎస్ కృష్ణసుమన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమబోర్డును పునరుద్ధరించాలి : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ గోపాలకృష్ణ

పామర్రు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భవన,ఇతర నిర్మాణ రంగ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని సీఐటీయు, భవననిర్మాణ కార్మికసంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో పామర్రు నియోజకవర్గ భవననిర్మాణ కార్మికుల సంఘ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. గృహ నిర్మాణాలకు బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డునుంచి సబ్సిడీలతో లోన్లు అందించాలన్నారు. వీటితోపాటు ఇంకా భవననిర్మాణకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కర సాధనకోసం ఈనెల 24న మచిలీపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో సీఐటీయూ నేతలు బడే కేశవరావు, రామ్మోహనరావు, విల్సన్, వేముపెదబాబు, పాల్గొన్నారు.

పన్నుబకాయిల చెల్లింపునకు గడువు పొడిగింపు

గుడివాడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 50 శాతం వడ్డీ మాఫీ స్కీం ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్టు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిలున్నవారు ఏకమొత్తంలో పన్నులను చెల్లించి వడ్డీ మాఫీ పొందాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలం పన్నులను ఏకమొత్తంలో ఈ నెల 30వ తేదీలోపు చెల్లిస్తే 5శాతం రాయితీ యిస్తున్నామన్నారు. ఆదివారం, సెలవు రోజుల్లోనూ కార్యాలయంలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక కౌంటర్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ శ్రీనివాసరావు కోరారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

కలెక్టరేట్ వద్ద బీసీ సంఘాల ధర్నా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : జనాభా దామాషా ఆధారంగా బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద బీసీ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు 27 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించడం వల్ల విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి, రాజకీయ పదవుల్లో అన్యాయం జరుగుతోందన్నారు. బీసీల రిజర్వేషన్లు 50 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెగ్గెం ప్రసాదరావు, శేకుబోయిన సుబ్రహ్మణ్యం, ఎస్. బాలాజీ, ఈడే కాశీవిశ్వేశ్వరరావు, బోసు, బొమ్మిడి విజయ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

ఘంటసాల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): యండకుదురు గ్రామ ప్రజలకు తాగునీటి ఎద్దడిని నివారించాలని యండకుదురు గ్రామసర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేమూరి రజనీకుమారి అధ్యక్షతన మండల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.సుబ్బారావు, తహసీల్దార్ విజయప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో చెరువులు నింపండి

కోడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కోడూరులోని తాగునీటి చెరువులను త్వరగా నింపాలని కోడూరు మండల ఎంపీడీవో సుధాప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవికాలం నేపథ్యంలో మండల పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుగానే గ్రామపంచాయతీ పరిధిలోని చెరువులను పంట కాలువలోని నీటితో నింపాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించి తాగునీటి సమస్యలపై సమన్వయంతో పని చేయాలన్నారు.

ఏప్రిల్ 15 నుంచి వేట నిషేధం

కోడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని కోడూరు ఎఫ్‌డీవో డి.స్వామి శేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకాయితిప్ప లాండింగ్ సెంటర్‌లో గల మర పడవల యాజమానులు, మత్స్యకారులు, మత్స్యకార సంఘ అధ్యక్షులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. మత్స్య సంపద రక్షణ కోసం ఏపీ ప్రభుత్వం విధించిన వేట నిషేదం ఆంక్షలు మత్స్యకారులు ఉల్లంఘించిన యెడల జరిమానా విధించడంతోపాటుగా లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠాపన

కోడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేకనూరులోని సూర్యనారాయణ స్వామి, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయస్వామివార్ల విగ్రహాలు ప్రతిష్ఠించి 16 ఏళ్లు పూర్తైన సందర్భంగా శుక్రవారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దీవి నరసింహమూర్తి (నాని), బాలకృష్ణ శర్మ, పాలకపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సింహాద్రి మదన్ - మోనిషా దంపతులచే స్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం సింహాద్రి పోతురాజు - రజని దంపతుల ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.

తూడు, గుర్రపు డెక్కను తొలగించాలి

అవనిగడ్డ : అవనిగడ్డ శివారు కాలిబాట వంతెన వద్ద పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపు డెక్కను తొలగించటం ద్వారా సాగునీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరించాలని పలువురు కోరుతున్నారు. దివిసీమలోని పంట కాలువలకు సాగునీరు అందించే క్రమంలో భాగంగా చెరువులు నింపుకోవటానికి అనువుగా అధికారులు సాగునీటిని విడుదల చేశారు. అయితే ప్రకాశం బ్యారేజీ నుంచి పెద్ద ఎత్తున తూటుకాడ, గుర్రపు డెక్క రావటంతో కాలిబాట వంతెన వద్ద నిలిచిపోయింది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి దిగువ ప్రాంతాలకు సైతం సాగునీరు అందించటానికి అనువుగా తూడుకాడ, గుర్రపు డెక్క తొలగించే పనులు చేపట్టాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

గుండె మార్పిడి చికిత్సకు బొండాడ ఔదార్యం

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ చిరువోలులంకకు చెందిన బచ్చు కుటుంబ రావుకు గుండె మార్పిడి చికిత్స జరుగనున్న నేపథ్యంలో బొండాడ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత డాక్టర్ బొండాడ రాఘవేంద్రరావు రూ.25 వేలు ఆర్థిక సాయమందించారు. కుటుంబరావు భార్య మాధవికి ఈ మొత్తాన్ని స్థానిక ఇండియన్ బ్యాంక్‌లో జమ చేసి సదరు ఓచర్‌ను డాక్టర్ వంగర శేషగిరిరావు చేతులమీదుగా అందజేశారు.

335 మద్యం సీసాలు పట్టివేత

నాగాయలంక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఈలచెట్లదిబ్బలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ బసవరావు బాపట్ల జిల్లా నుంచి అక్రమ మార్గంలో గ్రామానికి మద్యం బాటిళ్లు తెచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నాడన్న సమాచారం వచ్చింది. దీంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరమ్మ తన సిబ్బందితో గురువారం రాత్రి ఈలచెట్లదిబ్బలో దాడులు నిర్వహించారు. అక్కడ అక్రమ మార్గంలో నిల్వ ఉంచిన 335 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం అక్రమంగా అమ్మకాలు సాగిస్తున్న బసవరావును అరెస్టు చేసినట్టు ఆమె తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వసంత్, బసవరాజు, రాంబాబు, ఉష తదితరులు పాల్గొన్నారు.

కమ్మనమోలు చెరువుకు తాగునీరు

నాగాయలంక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కమ్మనమోలులోని తాగునీటి చెరువులో కాలువ నీరు నింపే కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. 15 ఎకరాల విస్తీర్ణంలో 9 కోట్ల లీటర్ల సామర్థ్యంతో మండలంలోని 14 గ్రామాలకు తాగునీరు అందించే ఈ చెరువు నింపే పనులను ఇరిగేషన్ శాఖ డీఈఈ పి.వెంకటేశ్వరరావు, ఏఈ రవితేజ పర్యవేక్షణలో చేపట్టారు. దీంతోపాటు మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో స్లో శాండ్ ఫిల్టర్లలో ఫిల్టర్ మీడియా మార్చే పనులు జరుగుతున్నాయి. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి సమకూర్చిన నిధులు రూ.15 లక్షలతో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు పనులు అధికారులు చేపట్టారు. ఈ పనులను ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, నీటి సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు పర్యవేక్షించారు.

ఎదురుమొండి - ఏటిమొగ వారధికి టెండర్లు

● నెరవేరనున్న దీవుల ప్రజల చిరకాల వాంఛ

నాగాయలంక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణానదిపై నిర్మించే ఎదురుమొండి - ఏటిమొగ వారధి నిర్మాణానికి రూ.109 కోట్ల వ్యయంతో టెండర్లు ఖరారు కావటంతో దీవుల ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతుందని పారిశ్రామిక వేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎదురుమొండి - ఏటిమొగ వారధికి రూ. 109 కోట్లతో టెండర్లు పిలువగా, విజయవాడకు చెందిన వల్లభనేని నిర్మాణ సంస్థ టెండర్‌ని దక్కించుకుందని ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారని ఆయన తెలిపారు. గుల్లలమోదలో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో చేపట్టిన క్షిపణి ప్రయోగ కేంద్రం నినర్మాణ పనులకు రూ.1000 కోట్లతో టెండర్లు పిలిచారన్నారు. డీఆర్డీవో ఆధ్వర్యంలో 130 కోట్లతో అవనిగడ్డ టౌన్ షిప్ నిర్మాణ పనులు కూడా టెండర్లను పిలుస్తున్నట్లు ఆయన వివరించారు.

విద్యుత్ సిబ్బంది తనిఖీలు

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ సెక్షన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది 28 బృందాలుగా ఏర్పడి గృహ , వ్యాపార సముదాయాలైన 2108 సర్వీసులను తనిఖీ చేసినట్లు ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. 205 సర్వీసులకు అదనపు లోడు కింద రూ.5,04,000లు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డీఈఈ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, చల్లపల్లి డీఈఈ పి.శివనాగేశ్వరరావు, ఉయ్యూరు డీఈఈ జి.హేమ కుమార్, ఉయ్యూరు డివిజన్‌లోని అన్ని సెక్షన్స్ ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలని మహిళల ధర్నా

మచిలీపట్నం టౌన్ : పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలంటూ జలాల్‌పేటలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మహిళలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. సీపీఎం నాయకురాలు తమ్ము చాందినీ, దుర్గ తదితరులు ఈధర్నాకు నాయకత్వం వహించారు. సీపీఎం నాయకుడు బి. సుబ్రహ్మణ్యం, చిరువోలు జయరావు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు , కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాజ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు కృషి చేయాలని ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. మహాత్మాజ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా మచిలీపట్నం వలందపాలెంలో శుక్రవారం జ్యోతిరావుపూలే విగ్రహానికి ఆర్టీసీ చైర్మన్ , మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ డీకే బాలాజీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాపరిషత్ సమావేశపు హాలులో జ్యోతిరావు చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టరు డీకే బాలాజీ మాట్లాడుతూ కులవివక్ష, అంటరాని తనం వంటి దురాచారాలపై పూలే ఉద్యమించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సునీల్, డీఆర్వో చంద్రశేఖర్, బిసి సంక్షేమ శాఖాధికారి జి.రమేష్, గిరిజన సంక్షేమ శాఖాధికారి ముదిగొండ ఫణి ధూర్జటి, బీసీ కార్పొరేషన్ ఈడీ శంకర్రావు, ఆర్డీవో స్వాతి, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి చిన నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో..

మచిలీపట్నంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఆర్. గంగాధరరావు జ్యోతీరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వివి నాయుడు తదితరులు పాల్గొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి, జ్యోతీరావుపూలే చిత్రపటానికి ఉపకులపతి కె. రాంజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బాపిరాజు, ఇతర అధికారులు జ్యోతీరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్టీసీ కార్యాలయంలో జిల్లా రవాణా అధికారి ఏ. వాణిశ్రీ, డీఎం పెద్దిరాజు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘాల నాయకులు కృష్ణ, వి.వి. రావు, ఎన్ఎంయుయూ జిల్లా చైర్మన్ వి. నాంచారయ్య, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సెక్రటరీ వై.వి. రావు, సీవీకే రావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వలందపాలెంలో జరిగిన జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కలెక్టర్ డీకే బాలాజీ , ఆర్టీసీ చైర్మన్ మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు



పూలే విగ్రహం వద్ద బీసీ నేతల నివాళి

టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో

మచిలీపట్నం టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా జ్యోతీరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. వలందపాలెంలోని జ్యోతీరావుపూలే విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, బీసీ సెల్ నాయకులు గోకుల శివ, రాయపూడి చిన్ని తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బుద్ధప్రసాద్

అవనిగడ్డ : అవనిగడ్డ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పూలే ఆశయాలకనుగుణంగా బలహీనవర్గాల కోసం కృషి చేస్తుందని తెలిపారు. అవనిగడ్డ వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కార్యాలయంలో కొల్లూరి వెంకటేశ్వరరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కుమారుడు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకటగిరి, టీడీపీ, జనసేన నేతలు యాసం చిట్టిబాబు, బచ్చు వెంకటనాథ్ పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుంగల సుమతి దేవి, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మోపిదేవి : మోపిదేవి ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన పూలే చిత్రపటానికి మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, పార్టీ నాయకులు నాదెళ్ల శరత్ చంద్రబాబు, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, బెల్లంకొండ ఏడుకొండలు, ఉప్పాల ఏసు తదితరులు పూలే చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

ఘంటసాల : ఘంటసాలలోని చిట్టూర్పులో పంచాయతీ సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీలక్ష్మీ కృష్ణవేణిలు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఘంటసాలపాలెంలో ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బోలెం అర్జునరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యండకుదురులో పూలే చిత్రపటానికి కార్యదర్శి యక్కటి సుబ్రహ్మణ్యం పూలమాల వేసి నివాళులర్పించారు. కొడాలి గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి సిహెచ్.వి.ఎస్.నాగమణి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీకాకుళం పంచాయతీలో సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ పూలే చిత్రపటాని పూలమాల వేసి నివాళులర్పించారు. ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కోడూరు : కుల నిర్మూలన ఉద్యమాలకు బీజం విప్లవ యోధుడు, జ్యోతిరావు పూలే అని కోడూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జనసేన కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోట రాంబాబు, జరుగు పోతురాజు, బచ్చు వెంకటేష్, పూతబోయిన కరుణ కుమార్, కాగిత రామారావు, లంకే భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. కోడూరు మండల బీసీ సేన అధ్యక్షులు కొండవీటి సురేష్ ఆధ్వర్యంలో కోడూరు ప్రధాన సెంటర్‌లో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. బీసీ సేన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చల్లపల్లిలో నివాళులర్పిస్తున్న నేతలు

చల్లపలి : సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే 198వ జయంతిని చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో పూలే అభిమాన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. విశ్రాంత ఈవోపీఆర్డీ దాసి సీతారామరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రైతుసంఘం నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, చినకళ్లేపల్లి సర్పంచ్ గుత్తికొండ రామారావులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, నేతలు కొర్రపాటి ముఖర్జీ, చంద్ర సుబ్బారావు, ఉప్పల సాంబశివరావు,బాబూరావులు పాల్గొన్నారు.



జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీన అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాకు సంబంధించి వాల్ పోస్టర్లను శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉమారాణి, జిల్లా ఉప అధికారి డి.విక్టర్ బాబు, నైపుణ్యాభివృద్ధి అధికారి పి.సురేష్ కుమార్, మండలి వెంకట్రామ్, స్కిల్ వెబ్ కో-ఆర్డినేటర్లు పృథ్వీజ, ఆర్.ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యపై స్పందించాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని రీజినల్ కార్యదర్శి కెవి.రావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద శుక్రవారం మధ్యాహ్నం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు బాలాజీ, డిపో కార్యదర్శి ఆళ్ల కుమార్, రీజినల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.వి.నాగేశ్వరరావు, గ్యారేజీ కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, గ్యారేజీ అధ్యక్షులు పి.చింతయ్య, సీసీఎస్ డెలిగేట్ సంజీవరావులతోపాటు 50 మందికిపైగా ఆర్టీసీ ఉద్యోగులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కదలిరండి

చల్లపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పరిరక్షణకై ప్రజలంతా కదిలిరావాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త ప్రచార ఆందోళనలో భాగంగా శుక్రవారం చల్లపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘంజిల్లా కార్యదర్శి గుత్తికొండ రాము, సీపీఐ నేతలు చంద్ర సుబ్బారావు, కొర్రపాటి ముఖర్జీ, నక్కా శ్రీను, కొల్లూరి శ్రీధర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చల్లపల్లి ప్రధాన సెంటర్లో సీపీఐ నిరసన ప్రదర్శన

పాల ఉత్పత్తిదారులకు బోనస్‌లు

గూడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయమని గూడూరు పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు గొరిపర్తి కృష్ణమూర్తి పేర్కొన్నారు. గూడూరు పాల ఉత్పత్తిదారుల సంఘం వద్ద శుక్రవారం కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు బోనస్ అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. గతేడాది డిసెంబర్ నుంచి ఈ సంవత్సరం మార్చి 31వరకు రూ. 1,04,960లను 29 మంది సంఘ రైతులకు బోనస్‌లు పంపిణీ చేశారు. పాలకవర్గ సభ్యులు కె. రమేష్ బాబు, సూపర్‌వైజర్ పోతన వెంకటరామయ్య పాల్గొన్నారు.



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న ముస్లింలు

గూడూరు చేరిన ముస్లింల పాదయాత్ర

గూడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింలు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం గూడూరు చేరుకుంది. రెండవ రోజు శుక్రవారం పామర్రు, నిడుమోలు గ్రామాల మీదుగా గూడూరు చేరుకుంది. ఈ సందర్భంగా గూడూరు జామియా మస్జిద్ కమిటీ ఘన స్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా లతీఫ్, వైసీపీ కానూరు వైస్‌ప్రెసిడెంట్ అబ్దుల్ హమీద్, కృష్ణాజిల్లా కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ మహబూబ్ ఖాన్, మహమ్మద్ రఫీ, మహమ్మద్ ఆసీఫ్, ఇబ్రహీం, షేక్ మౌలాలి, హన్ను, అబ్బులు, బాషా పాల్గొన్నారు.

పెడన : వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు శుక్రవారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జామియా మస్జిద్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పురపాలక సంఘ కార్యాలయం వరకు కొనసాగింది. అక్కడ మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీని పురస్కరించుకుని సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్సైలు గణేష్‌కుమార్, సత్యనారాయణ, నాగరాజులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

కృష్ణా విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 41 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి కె. రాంజీ, ఎం. శ్రావణి, వై.కె. సుందరకృష్ణ, రాంబాబు, దిలీప్, ఎన్. బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలోని పెదపట్నం, కానూరు గ్రామాల్లో శుక్రవారం జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు.కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి లంకే శేషగిరి, మీనవల్లి నాగేశ్వరరావు, గడిదేసి రవి పాల్గొన్నారు.